కలెక్టర్ నాగరాణికి ఉద్యోగోన్నతి

ప్రభుత్వ కార్యదర్శిగా హోదా కల్పిస్తూ ఉత్తర్వులు జారీ

భీమవరం: జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణికి రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శిగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. డిఆర్ఒ బి.శివనారాయణ రెడ్డి, వివిధ శాఖల అధికారులు కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు. ఐఎఎస్‌లకు ఉద్యోగోన్నతి కల్పించిన జాబితాలో కలెక్టర్ నాగరాణికి కార్యదర్శిగా సూపర్ టైమ్ స్కేల్ ఉద్యోన్నతి కల్పించింది. వీరికి కార్యదర్శి హోదా కల్పించినా కలెక్టర్‌గానే కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పోలవరం జిల్లాలో.. 'పోలవరం' లేదాయే..!

జిల్లాల పునర్విభజనకు కేబినెట్ ఆమోదం
పోలవరం జిల్లాపై ప్రజల అభిప్రాయానికి విరుద్ధంగా సర్కార్ ముందుకు
రంపచోడవరం, చింతూరు డివిజన్లతోనే పోలవరం జిల్లా
ఏలూరు జిల్లాలోని ఆదివాసీలకు సర్కార్ వెన్నుపోటు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పోలవరం జిల్లాలో 'పోలవరం' లేకుండా చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతోంది. జిల్లాల మార్పులపై ప్రజల అభిప్రాయాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో జిల్లాల మార్పులకు సంబంధించి ఆమోద ముద్ర పడింది. 31వ తేదీన తుది నోటిఫికేషన్ విడుదల చేయడం, జనవరి ఒకటో తేదీ నుంచి చేసిన మార్పులు అమల్లోకి రానున్నాయి. జిల్లాలోని ఆదివాసీలకు తీరని అన్యాయం చేసిన చంద్రబాబు సర్కార్ పై గిరిజనుల నుంచి తీవ్ర ఆగ్రహజ్వాలలు వ్యక్తమవుతున్నాయి. తాము అధికారంలోకి వస్తే ఏజెన్సీ ప్రాంతాలను పోలవరం జిల్లాగా ఏర్పాటు చేస్తామని ఎన్నికల సమయంలో కొయ్యలగూడెంలో జరిగిన బహిరంగ సభలో సిఎం చంద్రబాబు ప్రకటించారు. దీంతో జిల్లాలోని ఆదివాసీలంతా ఆ ప్రకటనను స్వాగతించారు. ఎన్నికల్లో

పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గం కలపాలని ఆందోళన (ఫైల్‌ఫోటో)

కూటమికి ఓట్లు వేసి గెలిపించారు. జిల్లాల విభజనకు సంబంధించి మార్పులు, చేర్పులు చేపట్టిన ప్రభుత్వం గత నెల 27న ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసింది. రంపచోడవరం, చింతూరు డివిజన్లతో పోలవరం జిల్లా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొంది. దీంతో పోలవరం నియోజకవర్గం లేకుండా పోలవరం జిల్లా ఏర్పాటు చేయడంపై తీవ్ర ఆగ్రహ జ్వాలలు వ్యక్తమయ్యాయి. ఏజెన్సీ బంద్ సైతం జరిగింది. ఆందోళనలు, నిరసనలు, రౌండ్‌టేబుల్ సమావేశాలు సాగాయి. జిల్లా ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సైతం అందించారు. ప్రభుత్వం మాత్రం ప్రజల అభిప్రాయానికి ఏమాత్రం విలువ లేకుండా ప్రాథమిక నోటిఫికేషన్‌లో ప్రకటించినట్లుగానే పోలవరం జిల్లా ఏర్పాటుకు ఆమోద ముద్ర వేసింది. దీంతో పోలవరం నియోజకవర్గంలోని గిరిజనులకు తీరని అన్యాయం చేసింది. పోలవరం నిర్వాసితులంతా పోలవరం నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో ఉన్నారు. ఏజెన్సీ ప్రాంతాలను జిల్లాగా ఏర్పాటు చేస్తున్నప్పుడు ఏలూరు జిల్లాలోని ఏజెన్సీ మండలాలను విస్మరించడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. పోలవరం నియోజకవర్గం లేకుండా పోలవరం జిల్లా ఏర్పాటు చేయడం ఏమిటనే ప్రశ్న అందరినీ తొలిచేస్తోంది.

రెవెన్యూ క్లినిక్‌లు ప్రారంభం

తొలిరోజు 59 అర్జీలు స్వీకరణ
రెవెన్యూ యంత్రాంగం జవాబుదారీతనంతో సేవలందించాలి
కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

రెవెన్యూ క్లినిక్‌ను స్థానిక కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సోమవారం ప్రారంభించారు. దరఖాస్తుల పరిశీలన, సలహా సూచనల విభాగం, 22ఎ సమస్యలు, భూసేకరణ సంబంధిత సమస్యలు, ఆర్ఒఆర్ పట్టాదారు పాసుపుస్తకాలు, సుమోటో అడంగల్ కరెక్షన్ సంబంధిత సమస్యలు, రీసర్వే, విస్తీర్ణం తేడా, జాయింట్ ల్యాండ్ పార్సల్ మ్యాప్ (ఎల్‌పిఎం) సంబంధిత సమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలన్నింటినీ ఇక్కడ ఏర్పాటు చేశారు. వీటి పనితీరు ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సూచనల మేరకు రెవెన్యూ క్లినిక్ ఏర్పాటు చేశామన్నారు. దీనిద్వారా రెవెన్యూ సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయన్నారు. జిల్లాలో ఎక్కువగా భూసంబంధ సమస్యలు ఉంటున్నాయని, వాటన్నింటికీ రెవెన్యూ క్లినిక్ ద్వారా చక్కటి పరిష్కారం లభించనుందన్నారు. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోమవారం ఒక్కరోజే 59 అర్జీలను స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డిఆర్ఒ బి.శివన్నారాయణరెడ్డి, గ్రామ, వార్డు సచివాలయాల అధికారి వై.దోసిరెడ్డి, కలెక్టరేట్ ఎఒ ఎన్.వెంకటేశ్వరరావు, వివిధ మండలాల తహశీల్దార్లు రావి రాంబాబు, సుందర సింగ్, దశిక వంశీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఏడిద శ్రీనివాసరావు, ఎవి.రామాంజనేయులు, కెఆర్‌సిసి తహశీల్దార్ సాయికృష్ణ, డిప్యూటీ తహశీల్దార్లు మద్రాపు సన్యాసిరావు, శేఖర్, పాల్గొన్నారు.

రెవెన్యూ క్లినిక్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

జిల్లాను క్రీడల్లో అగ్రస్థానంలో నిలపాలి

జిల్లాను క్రీడల్లో అగ్రస్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. స్థానిక కలెక్టరేట్లో సోమవారం విశాఖపట్నంలో జరిగిన 63వ నేషనల్ స్కేటింగ్ ఇన్ లైన్ హాకీ, రోలర్ హాకీ విభాగాల్లో పతకాలు గెలుపొందిన క్రీడాకారులను ఆమె అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి క్రీడల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలన్నారు. విశాఖపట్నంలో డిసెంబరు ఐదు నుండి 15 వరకు జరిగిన 63వ నేషనల్ స్కేటింగ్ ఇన్ లైన్ హాకీ, రోలర్ హాకీ విభాగాల్లో జిల్లా క్రీడాకారులు ఒక బంగారు పతకం, ఆరు వెండి పతకాలు, ఒక రజత పతకం మొత్తం ఎనిమిది పతకాలు సాధించారు. 12 సంవత్సరాల్లోపు విభాగంలో ఇన్ లైన్ హాకీలో మైత్రి దాస్ బంగారు పతకం, 15 సంవత్సరాలలోపు విభాగంలో ఘంటా జశ్వంత్ వెండి పతకం, రోలర్ హాకీలో 12 సంవత్సరాల్లోపు విభాగంలో కమలా నిత్యేష్‌గౌడ్, 15 సంవత్సరాల్లోపు విభాగంలో మునుపర్తి నాగ సాయికేశవ్ వెండి పతకాలను సాధించారు. 18 సంవత్సరాల్లోపు విభాగంలో మకరపు ఓంకార్ వెండి పతకం, సానబోయిన స్నేహశ్రీ వెండి పతకం, రజత పతకం సాధించారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డిఎస్‌డిఒ ఎన్.మోహన్‌దాస్, డిఇఒ ఇ.నారాయణ, సమగ్ర శిక్ష ఎపిసి శ్యామ్‌సుందర్, తణుకు స్కూల్ ప్రిన్సిపల్, జిల్లా రోలర్ స్కేటింగ్ సెక్రటరీ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల సభకు కదలిరండి..

సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో సోమవారం ప్రచారం హోరెత్తింది. జనవరి 4న విశాఖపట్నంలో నిర్వహించనున్న ప్రదర్శన, బహిరంగ సభకు కదలిరండి అంటూ నేతలు వివిధ రూపాల్లో సాగిస్తున్న ప్రచారం కార్మికులను కదిలిస్తోంది. 'మన మీటింగ్‌కు వెళ్దాం పద' అంటూ 4న విశాఖ తరలివెళ్లేందుకు జట్లు, పరిశ్రమలు, నివాస ప్రాంతాల వారీగా కార్మికులు చకచకా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సొంత ఖర్చుతో బస్సులు, రైళ్లు, ప్రత్యేక వాహనాల్లో వెళ్లేందుకు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు.

ప్రచార హోరు.. ఏర్పాట్లు జోరు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఈ నెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖ పట్నంలో జరిగే సిఐటియు అఖిలభారత మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం పట్టణంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని సిఐటియు జిల్లా అధ్యక్షులు కర్రి నాగేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. కార్మికులు, ప్రధానంగా యువకులు ఈ మోటారు సైకిల్ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. 4న బహిరంగ సభ, ప్రదర్శనకు తాడేపల్లిగూడెం పట్టణం నుండి వెయ్యి మంది కార్మికులు వెళ్లేందుకు సిద్ధమయ్యారని తెలిపారు. కార్యక్రమానికి నేతలు సిరపరపు రంగారావు, జవ్వాది శ్రీనివాస్, చిర్ల పుల్లారెడ్డి, మడక రాజు, దేశంశెట్టి సతీష్, వరి అప్పారావు, సిద్దిరెడ్డి శేషు, మాదాసు రాజు తదితరులు నాయకత్వం వహించారు.

తాడేపల్లిగూడెం: జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు కర్రి నాగేశ్వరరావు

భీమవరంలో..

ఆకివీడు: సిఐటియు మహాసభ జయప్రదం చేయాలని పట్టణంలో మోటార్ సైకిల్ యాత్ర నిర్వహించారు. స్థానిక వెలమపేట రామాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ గాంధీబొమ్మ సెంటర్, జాతీయ రహదారి మీదుగా ఎస్ టర్నింగ్ వరకూ సాగింది. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ బి.రాంబాబు, కోకన్వీనర్లు కె.తవిటినాయుడు, నేతలు పెంకి అప్పారావు, సాకా కిసింజర్, తమ్మిశెట్టి కృష్ణ, గండేటి ఈశ్వరరావు, చీకటి శ్రీను, రాగాల రవి, తోట పద్మ, గాంధీ, బివి.వర్మ, కె.గౌరినాయుడు పాల్గొన్నారు.

భీమవరం: గ్యాస్ డెలివరీ బోయ్స్‌పై వేధింపులు ఆపాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వాసుదేవరావు డిమాండ్ చేశారు. సిఐటియు అఖిలభారత మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ జిల్లాలో గ్యాస్ డెలివరీ బోయ్స్‌గా పని చేస్తున్న కార్మికుల్లో సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్యాస్ డెలివరీ బోయ్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వాసుదేవరావు మాట్లాడారు. గ్యాస్ డెలివరీ బోయ్స్‌కు కార్మిక చట్టాలను అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్యాస్

ఆకివీడులో..

సిలిండర్ పట్టుకుని భవనాలు ఎక్కుతూ, దిగుతున్న కార్మికులు రోగాల పాలవుతున్నారని, కనీసం ఇఎస్ఐ అమలు చేయడం లేదని విమర్శించారు. ఒకపక్క పెరుగుతున్న ధరలు, మరోపక్క చాలీచాలని జీతాలతో కార్మికులు ఎలా బతకాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో గ్యాస్ వర్కర్స్ యూనియన్ నాయకులు బి.సీతారామయ్య, ఎం.సింహాచలం, చంద్రరావు, వెంకన్న, ఏడుకొండలు పాల్గొన్నారు.

పాలకోడేరు: అంగన్వా డీలంతా విశాఖ సభకు తరలి రావాలంటూ గొల్లలకోడేరులో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కళ్యాణి మాట్లాడారు.

ఆచంట: విశాఖపట్నంలో 4న జరిగే ప్రదర్శన, బహిరంగ సభకు తరలి రావాలని సిఐటియు మండల కన్వీనర్ బండి రంగారావు పిలుపునిచ్చారు. సోమవారం ఆచంటలో గోడ స్టిక్కర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నేతలు పి.మోహన్‌రావు, తలుపురి బుల్లబ్బాయి, మట్టపర్తి నాగలక్ష్మి, చిలుకూరి వరలక్ష్మి, బుర్ర వెంకటలక్ష్మి, చిలుకూరి స్వప్న, చిలుకూరి సురేఖ, వేండ్ర శ్రీనిధి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాలకోడేరులో..

పిజిఆర్‌ఎస్ అర్జీలు నాణ్యతతో పరిష్కరించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

పిజిఆర్‌ఎస్‌లో ప్రజల నుండి అందిన అర్జీలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నాణ్యమైన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. స్థానిక కలెక్టరేట్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డిఆర్ఒ బి.శివన్నారాయణరెడ్డి, గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు పాల్గొని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుంచి 221 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి నిర్ణీత గడువులోపు నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యల పరిష్కారం ఉండాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధుల సంక్షేమం ట్రిబ్యునల్ మెంబర్ మేళం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగరాణి

వికలాంగులకు మూడో శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్

వికలాంగులకు ప్రతినెలా మూడో శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. స్థానిక కలెక్టరేట్లో వికలాంగుల సమస్యలపై ఆమె అధికారులతో మాట్లాడారు. వికలాంగులు తమ సమస్యలను ప్రత్యేక గ్రీవెన్స్ డే రోజున అందజేయాలని సూచించారు. పశ్చిమగోదావరి జిల్లా విజువల్లి ఛాలెంజ్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రూపొందించిన వికలాంగుల హక్కుల చట్టం-2016 పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులతోపాటు అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.బాలాజీ, రాష్ట్ర కార్యదర్శి బి.రాములు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా విజయరామరాజు, క్రాంతికుమార్

ప్రజాశక్తి - భీమవరం

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా పిఎస్.విజయరామరాజు, పోలిశెట్టి క్రాంతికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మరో 16 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. పెంటపాడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన యుటిఎఫ్ 51వ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఈ కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా సిహెచ్.పట్టాభిరామయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా కె.రాజశేఖర్, జిల్లా అసోసియేట్ మహిళా అధ్యక్షులుగా సిహెచ్.నాగశిరోమణి, జిల్లా కోశాధికారిగా పి.శివప్రసాద్, కార్యదర్శులుగా ఎస్.రత్నరాజు, జెజె.కుమార్, జి.లక్ష్మీనారాయణ, ఎం.శ్రీనుబాబు, డి.ఏసుబాబు, జి.రామకృష్ణరాజు, కెఎస్.రామకృష్ణప్రసాద్, సిహెచ్.కుమార్ బాబ్జి, పి.కృష్ణకుమారి, దండు పద్మావతి, బ్రహ్మయ్య, ఎంవి.రాజశేఖర్, జి.పుల్లారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రానున్న రోజుల్లో ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు కృషి చేస్తామని యుటిఎఫ్ నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, పోలిశెట్టి క్రాంతికుమార్ అన్నారు. ప్రధానంగా సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఇన్‌సర్వీస్ టీచర్లు అందరూ టెట్‌లో క్వాలిఫై కావాలనే నిబంధనను సడలించాలని కోరారు. జనవరి 10న గుంటూరులో రాష్ట్రస్థాయి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బోధనేతర కార్యక్రమాల నుండి ఉపాధ్యాయులను మినహాయించాలని, పదో తరగతికి వంద రోజుల, ఎలిమెంటరీ క్లాసులకు 75 రోజుల ప్రత్యేక ప్రణాళిక అమలులో సెలవు, పండుగ దినాలను మినహాయించాలని విజ్ఞప్తి చేశారు.

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతి, అధ్యక్షులు విజయరామరాజు

మద్యం దుకాణాల వేళలు తగ్గించండి

ఐద్వా ఆధ్వర్యాన వినతి

ప్రజాశక్తి - ఆకివీడు

నూతన సంవత్సరం సందర్భంగా మద్యం అమ్మకాల వేళలను తగ్గించాలని ఎక్సైజ్ సిఐకు ఐద్వా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. డిసెంబర్ 30 నుండి జనవరి 1వ తేదీ వరకు మద్యం అమ్మకాలను రాత్రి 7 గంటలకు ముగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సందక ఉదయకుమారి మాట్లాడుతూ నూతన సంవత్సరం వేడుకలు సందర్భంగా డిసెంబర్ 30 నుండి జనవరి ఒకటో తేదీ వరకు మద్యం అమ్మకాల వేళలను పెంచాలనుకోవడం దుర్మార్గమన్నారు. దీనివల్ల మహిళలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయని, పైగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకునే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిదృష్ట్యా ఈ మూడు రోజులు మద్యం అమ్మకాలను రాత్రి ఏడు గంటల నుంచి నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఐద్వా నేతలు జి.లావణ్య, బి.కళ్యాణి, దొడ్డి పద్మ తదితరులు పాల్గొన్నారు.



వినతి అందిస్తున్న ఐద్వా నేతలు

అప్పలరాజును విడుదల చేయాలని ధర్నా

ప్రజాశక్తి - తణుకు

అప్పలరాజుపై అక్రమంగా పెట్టిన పీడీ యాక్టు కేసును ఉపసంహరించి, ఆయనను వెంటనే విడుదల చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి.ప్రతాప్, పట్టణ కార్యదర్శి అడ్డగర్ల అజయకుమారి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక వెంకటేశ్వర సెంటర్లో అనకాపల్లి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజుపై పీడీ యాక్టు తొలగించి వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో నిరసన, ధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్, అజయ కుమారి మాట్లాడుతూ పాలక పక్షాలు అధికారంలో ఉంటే ఒకరకంగా, లేకపోతే ఒకరకంగా వ్యవహరించడం సిగ్గు చేటన్నారు. అనకాపల్లి జిల్లాలో బలక్ డ్రగ్స్ ఏర్పాటు కోసం ఇచ్చిన భూముల రైతులు పక్షాన అప్పలరాజు మద్దతు ఇచ్చినందుకు పీడీ యాక్ట్ పెట్టి అరెస్టు చేశారని అన్నారు. ఆందోళనలు, పోరాటాలు రాకుండా ఉండాలంటే కేసులు, అరెస్టులు చేయడం కాదని, రైతులు, గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేయాలని అన్నారు. నేడు అధికారంలో ఉన్న ప్రభుత్వాలు చేపట్టే అనేక అంశాలు వ్యతిరేకించే హక్కు ప్రజలకు ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పలరాజును బేషరత్‌గా విడుదల చేయాలని, లేకపోతే తగిన గుణపాఠం ప్రజలు చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు గార రంగారావు, కామన మునిస్వామి, గుబ్బల గోపి, పి.రాజా, కె.నాగరత్నం, ఎన్.చిన్నారావు నర్సింహమూర్తి, లక్ష్మీనాయుడు, ఎం.రమేష్, రవి, సింగులూరి సత్యనారాయణ, ప్రసాద్, టి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా వెంకటరామిరెడ్డి

నరసాపురం: నరసాపురం మున్సిపల్ కమిషనర్‌గా ఆర్.వెంకటరామిరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ పనిచేసిన అంజయ్య అనంతపురం కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. రామిరెడ్డి అమరావతిలోని కమిషనర్ కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో రామిరెడ్డి నూజివీడు, బాపట్ల, పుటపర్తి, డోన్, వినుకొండ, చీమకుర్తి మున్సిపాల్టీలో పని చేశారు. బాధ్యతలు చేపట్టిన ఆయనను ఆర్ఒ మురళీ, డిఇ ప్రసాద్, ఆర్ఐ కృష్ణమోహన్, ఎఇ నవ్య, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

యూరియాను అందుబాటులో ఉంచాలి : జెసి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో రబీ సాగుకు అవసరమైన యూరియా అందుబాటులో ఉంచాలని, రైతు సేవా కేంద్రాలు, సొసైటీల్లో నిల్వ ఉండేలా ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. కలెక్టరేట్లో మండలాల వారీగా యూరియా నిల్వలు ఎలా ఉన్నాయి, రైతుల అభిప్రాయాలు, రానున్న వారం రోజుల్లో ఏ ప్రాంతంలో ఎంత పరిధిలో నాట్లు జరిగాయి తదితర అంశాలపై వ్యవసాయ అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో యూరియా సరఫరాపై రైతుల అభిప్రాయాల సేకరణకు ప్రతి రైతు సేవా కేంద్రం పరిధిలో పది మంది రైతులతో ముఖాముఖి చర్చకు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలోని ఇంకా మిగిలిన ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డిఎం సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ ఎండి ఇబ్రహీం, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, అధికారులు పాల్గొన్నారు.

'కారుమూరిపై కేసులు దుర్మార్గం'

ప్రజాశక్తి - తణుకు

వైఎస్ఆర్ విగ్రహానికి చంద్రబాబు ఫ్లెక్సీ కట్టి టిడిపి నాయకులు వివాదానికి తెరతీసిన నేపథ్యంలో నిలదీసినందుకు మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుపై అక్రమ కేసు పెట్టటం దుర్మార్గమని వైసిపి పంచాయతీరాజ్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి సీతారామ్ విమర్శించారు. ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ రాష్ట్రంలో అమల్లో ఉన్న చంద్రబాబు రెడ్ బుక్ రాజ్యాంగాన్ని తణుకులో చూపిస్తున్నారని విమర్శించారు. వైసిపి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలపై చంద్రబాబు రెడ్ బుక్ రాజ్యాంగం రాక్షసక్రీడతో రాక్షస ఆనందం పొందుతున్నారని విమర్శించారు. ఫ్లెక్సీ వివాదంలో తణుకులో టీడీపీకి జరిగిన నష్టాన్ని అధిగమించే క్రమంలో డైవర్షన్ కోసం మాజీ మంత్రి కారుమూరి దళిత వర్గానికి చెందిన సిఐని దూషించారని ఒకరోజు డ్రామా నిర్వహించారని తెలిపారు. 144 సెక్షన్‌ను నిబంధనలను పాటించలేదంటూ కారుమూరితో సహా 13 మందిపై కేసులు నమోదు చేయడం దుర్మార్గమన్నారు. అక్రమ కేసులపై కూడా న్యాయపరంగా వెళ్తామని స్పష్టం చేశారు. వైసిపి లీగల్ సెల్ సభ్యులు వెలగల సాయిబాబారెడ్డి మాట్లాడారు. కారుమూరిపై టిడిపి నాయకులు చేస్తున్న వ్యాఖ్యలకు సంబంధించి మీ అధికారం పోయాక అవన్నీ మీ మెడకు చుట్టుకుంటాయని తెలిపారు. పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, డిసిఎంఎస్ మాజీ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్ పాల్గొన్నారు.

ఈలంపూడి సొసైటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

భీమవరం టౌన్: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతులను ఆదుకోవాలని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. మండలంలోని ఈలంపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం సోమవారం ఈలంపూడిలో నిర్వహించారు. ఛైర్మన్‌గా మంతెన త్రినాథరాజు డైరెక్టర్లుగా యర్రంశెట్టి లక్ష్మణ్, బొక్కా శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేశారు. ఎంఎల్ఎ మాట్లాడారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా త్రిసభ్య కమిటీ పని చేయాలన్నారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామస్తులు, సర్పంచులు, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి పూర్తి ఏర్పాట్లు

కాళ్ల: ముక్కోటి ఏకాదశికి దేవాదాయ ధర్మదాయ శాఖ ద్వారా అన్ని ఏర్పాట్లూ చేశామని జిల్లా అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్య ప్రకాష్‌రావు అన్నారు. కాళ్లకూరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం జరగనున్న ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లను దేవాదాయ ధర్మదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్య ప్రకాష్‌రావు సోమవారం రాత్రి పరిశీలించారు. యాత్రికుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేశామన్నారు. భీమవరం ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వరరావు, ఆలయ ఇఒ అరుణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెల్లో రంగవల్లుల సందడి

ప్రజాశక్తి - కాళ్ల

పల్లెల్లో రంగవల్లుల సందడి మొదలైంది. డిసెంబర్ 31, జనవరి 1వ తేదీన ప్రతి గ్రామంలో వివిధ రంగవల్లుల ప్రదర్శన చేయడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో పలు గ్రామాల్లో రంగుల విక్రయాలు ప్రారంభమయ్యాయి. న్యూ ఇయర్ ప్రారంభం నుంచి సంక్రాంతి వరకూ రంగవల్లుల సందడి కనిపిస్తుంది. మహిళలు ఇంటి ముందు రంగు రంగుల ముగ్గులతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతుంటారు. వ్యాపారులు దాదాపు 50 రకాలు పైబడే రంగులను అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం మార్కెట్లో వివిధ రకాల రంగుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఆయా దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడింది.

పాడేరు డిఎస్‌పిగా పాలకొల్లు వాసి అభిషేక్

పాలకొల్లు :పాలకొల్లుకు చెందిన ప్రముఖ న్యాయవాది రావూరి చాచా కుమారుడు అభిషేక్ సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు డిఎస్‌పిగా బాధ్యతలు చేపట్టారు. అభిషేక్ 2023లో వెలువడిన ఎపిపిఎస్‌సి గ్రూప్-1 పరీక్షల్లో డిఎస్‌పిగా ఎంపికయ్యారు. శిక్షణ అనంతరం మొదటి పోస్టింగ్‌గా పాడేరు కేటాయించారు. ఈ సందర్భంగా పాలకొల్లు ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

పెనుమంట్ర:యుటిఎఫ్ పెనుమంట్ర మండల నూతన (2026-27) కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. ఈ మేరకు కొత్త కార్యవర్గం గౌరవాధ్యక్షులుగా కె.కాశీవిశ్వనాథం, అధ్యక్షులుగా ఎల్.రామస్వామి, అసోసియేట్ అధ్యక్షులుగా ఎస్.మురళీకృష్ణ, మహిళా అధ్యక్షురాలుగా ఎస్.విజయకుమారి, ప్రధాన కార్యదర్శిగా డిఎన్‌వి.సత్యనారాయణ, కోశాధికారిగా జివి.శ్రీనివాసరావు, మండల ఆడిట్ కార్యదర్శిగా బి.రాము, జిల్లా కౌన్సిలర్స్‌గా కె.సాయిరెడ్డి, శ్రీనివాసుల రామకృష్ణ బి.జయశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని పాఠశాలలను బలోపేతం చేయడంతోపాటు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో కృషి చేస్తామని నూతన కార్యవర్గం సభ్యులు తెలిపారు.

గాయపడ్డ భవన నిర్మాణ కార్మికునికి సాయం

పోడూరు:అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పేదలకు వసుధ ఫౌండేషన్ అందిస్తున్న సహకారం ఎంతో ఊరటనిస్తుందని పాలకొల్లు క్షత్రియ పరిషత్ అధ్యక్షులు చేకూరు సూరిబాబు అన్నారు. పోడూరుకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు గుబ్బల మోహనరావు భవన నిర్మాణ కార్మికుడు 4 నెలల కిందట నిర్మాణ పనుల్లో ఉండగా ఒకటో అంతస్తు నుంచి కింద పడిపోయాడు. అతని వెన్నెముకకు తీవ్ర గాయం కావడంతో అప్పటి నుంచి మంచానికే పరిమితమయ్యాడు. అతని వైద్యానికి కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పెనుమత్స బుద్ధరాజు చైర్మన్ మంతెన వెంకటరామరాజుకు వివరించారు. ఆయన వెంటనే స్పందించి మోహనరావు వైద్య నిమిత్తం వసుధ ఫౌండేషన్ ద్వారా రూ.20 వేల ఆర్థిక సాయం మంజూరు చేశారు. చెక్కును సోమవారం పోడూరులో పాలకొల్లు క్షత్రియ పరిషత్ అధ్యక్షులు చేకూరి సూరిబాబు, సొసైటీ చైర్మన్ రుద్రరాజు శివాజీరాజు చేతుల మీదుగా బాధితుడు మోహనరావు తల్లి పద్మావతికి అందజేశారు.

రబీకి యూరియా సిద్ధం : ఎఒ

నరసాపురం:రబీ సాగుకు అవసరమైన యూరియాను సిద్ధం చేసినట్లు ఎఒ జ్యోషిలా తెలిపారు. 2025-26 రబీ సాగుకుగాను మండలంలో సుమారు 153 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. ప్రయివేటు వ్యాపారుల వద్ద 43 మెట్రిక్ టన్నులు, సొసైటీలు, డిసిఎంఎస్ స్టోర్‌లలో 105 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. ఎంఆర్‌పి ధర యూరియా బస్తా రూ.266.50 మాత్రమే చెల్లించి రైతులు ఎరువును కొనుగోలు చేయాలని సూచించారు. అదనపు ధరలకు విక్రయించినట్లు తమకు ఫిర్యాదులు అందితే విచారణలో రుజువు అయినా, కృత్రిమ కొరత సృష్టించిన డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎఒ తెలిపారు.

సాంబశివరాజు సేవలు ఎనలేనివి

ఉండి:ఉండి ఎఎంసి మాజీ చైర్మన్ సాగిరాజు సాంబశివరాజు రైతులకు చేసిన నిస్వార్థ సేవలు ఎనలేనివని ఉండి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కలిదిండి రామకృష్ణంరాజు, వైస్ చైర్మన్ యడవిల్లి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం ఉండి ఎఎంసి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తొలుత సాంబశివరాజు చిత్రపటానికి సభ్యులు పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ రైతుల అభ్యున్నతికి సాంబశివరాజు ఎనలేని సేవలు చేశారన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో సుమారు రెండు కోట్ల రూపాయలతో ఎఎంసి ప్రాంగణంలో రైతులకు ఉపయోగపడేలా కన్వెన్షన్ హాల్ నిర్మించాలని ప్రతిపాదనలు చేసి ఉన్నతాధికారులకు తీర్మానం పంపిస్తున్నట్లు చైర్మన్ రామకృష్ణంరాజు, వైస్ చైర్మన్ వెంకటేశ్వరరావు తెలిపారు.ఏలేశీఅవిఎ పాలకోడేరు రూరల్ బ్యాంక్ చైర్మన్ కొత్తపల్లి నాగరాజు, ఎఎంసి డైరెక్టర్లు, ఎఎంసి కార్యదర్శి ఎన్.మావుళ్ల పాల్గొన్నారు.

టిడిపి నేత శ్రీనివాసరెడ్డికి సత్కారం

పెనుమంట్ర:పాతిక సంవత్సరాలు టిడిపి మండల అధ్యక్షులుగా విశేష సేవలందించిన తమనంపూడి శ్రీనివాసరెడ్డి (బుల్లా) కి పార్టీలో తగిన గుర్తింపు దక్కిందని పలువురు వక్తలు అన్నారు. సోమవారం సాయంత్రం మార్టేరు వేదికపై శ్రీనివాసరెడ్డికి స్థానిక పంచ గ్రామాల్లోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి అభినందన సభ నిర్వహించారు. మాజీ మంత్రి దండు శివరామరాజు ప్రియ శిష్యుడుగా మెలిగిన శ్రీనివాసరెడ్డి అధికారం ఉన్న సమయంలో పదవులు, నామినేట్ పదవులను ఆశించలేదని తెలిపారు. తేతలి రాజారెడ్డి, కోణాల కోదండ చంద్రశేఖర్ రెడ్డి, కారేపల్లి భాస్కర్ రావు, మజ్జి అచ్యుతరావు పాల్గొన్నారు.

డిఎన్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థిని ప్రతిభ

పాలకొల్లు:డిఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సెకెండియర్ విద్యార్థిని చిట్టూరి దేవిశ్రీ, ఇటీవల తణుకులో జరిగిన జిల్లా పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ, జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి వ్యాస రచన పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచింది. 'డిజిటల్ న్యాయ పాలన ద్వారా సమర్థ సత్వర పరిష్కారం' అంశంపై రూ.2 వేల నగదు బహుమతిని జెసి ద్వారా అందుకున్న వైస్ ప్రిన్సిపల్ రవిశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

ఉండి:ఉండి లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని ఉనుదుర్రు సర్పంచి పిన్నంరాజు నాగలక్ష్మి అన్నారు. మండలంలోని ఉణుదుర్రు, యండగండి పాఠశాలలో సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యా సామగ్రి, హోమియో పిల్స్ పంపిణీ చేశారు. క్లబ్ ప్రెసిడెంట్ గాదిరాజు రంగరాజు మాట్లాడుతూ ఇంటర్ నేషనల్ డైరెక్టర్ సుభాష్ బాబు సౌజన్యంతో జిల్లా లయన్స్ క్లబ్ ఇచ్చిన విద్యా సామగ్రిని జిల్లాలోని అన్ని పాఠశాలలకూ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. క్లబ్ కార్యదర్శి పెన్మెత్స రంగ ప్రసాదరాజు, పాఠశాల హెచ్‌ఎం కుక్కల వామనమూర్తి, యండగండి పాఠశాల హెచ్‌ఎం కె.శ్రీలక్ష్మి మాట్లాడారు. క్లబ్ మాజీ ప్రెసిడెంట్ సత్తి బ్రహ్మారెడ్డి, టీచర్లు ఎ.అంజిబాబు, వికె.సుభద్ర, బి.క్రాంతిరేఖ, విబిఎల్ దేవి పాల్గొన్నారు.

రీసర్వేతో సమస్యలు పరిష్కారం

మొగల్తూరు:రీసర్వేతో రెవెన్యూ సమస్యలు పరిష్కారం అవుతాయని తహశీల్దార్ కె.రాజకిషోర్ అన్నారు. ముత్యాలపల్లిలోని సచివాలయ ప్రాంగణంలో ముత్యాలపల్లి, మోడీ, వారతిప్ప, కొత్తట గ్రామాల సంబంధించి సోమవారం తహశీల్దార్ రాజ కిషోర్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. రైతులు భూములకు సంబంధించి ఆధారాలు సమర్పించాలని సూచించారు. అనంతరం సర్వే పై గ్రామంలో అవగాహన ప్రదర్శన చేశారు. సర్పంచులు అడ్డాల సూరిబాబు, పడవల సూర్యనారాయణ, ఎంపిటిసిలు తిరుమాని స్వామి, లింగం ఏసుబాబు, మాజీ సర్పంచి పడవల గంగరాజు, గట్టెం శ్రీను, మోటిపల్లి రామ భాస్కరరావు, కొల్లాటి బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, విఆర్ఒ శామ్యూల్‌రాజు పాల్గొన్నారు.

ఫౌండేషనల్ లీటరసీ అండ్ న్యూమరసీతో లక్ష్య సాధన

కాళ్ల:చక్కని బోధనోపకరణ సామగ్రిని ఉపయోగించి కృత్యాధార బోధన చేయడం ద్వారా ఫౌండేషనల్ లీటరసీ అండ్ న్యూమరసీ లక్ష్యాలు సాధించొచ్చని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ పి.శ్యాంసుందర్ అన్నారు. సోమవారం సీసలి స్పెషల్ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఫౌండేషనల్ లీటరసీ అండ్ న్యూమరసీ అమలు తీరును పర్యవేక్షించి తన సంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని పాఠ్యాంశాలకు సంబంధించీ ఆకర్షణీయమైన టిఎల్ఎం ఉపయోగించి కృత్యాధార బోధన చేయడం ద్వారా పిల్లల్లో ఆశించిన సామర్థ్యాలు గణనీయంగా పెరగడం అభినందనీయమన్నారు. అలాగే ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులచే ఏర్పాటు చేయబడిన టిఎల్ఎం మేళాను పరిశీలించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముందస్తు నూతన సంవత్సర వేడుకలను కూడా నిర్వహించి కేక్ కట్ చేశారు.

కోడిపందేలు, జూదాలు జరిగితే సమాచారమివ్వండి

ఆకివీడు :సంక్రాంతి, నూతన సంవత్సరం సందర్భంగా జూద క్రీడలు, కోడిపందేలు వంటి అక్రమ క్రీడలు జరగకుండా గ్రామ స్థాయి అధికారులు పూర్తి సమాచారాన్ని తమకు అందించాలని మండల స్థాయి అధికారులు కోరారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఫారుక్ అధ్యక్షతన గ్రామస్థాయి రెవెన్యూ పంచాయతీ అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామస్థాయి కమిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామాల్లో జరిగే జూదం, కోడి పందేలు, మద్యం అక్రమ అమ్మకాలు చేస్తే తమకు సమాచారం అందించాలన్నారు. ఎండిఒ బాబూరావు, ఎస్ఐ నాగరాజు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు దుస్తులు అందజేత

ప్రజాశక్తి - పెనుమంట్ర

అనాథ పిల్లలకు తల్లిదండ్రులు లేని లోటు భర్తీ చేయడం సాధ్యం కాదని, ఉన్నంతలో వారికి ప్రేమ అందించాలనే దృక్పథంతో ఉండాలని మచిలీపట్నం జిహెచ్‌సి న్యూరో అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ గొల్ల రామకృష్ణ అన్నారు. సోమవారం ఓడూరులోని మేరీ హౌస్ ఆఫ్ కాంపెన్సేస్ ట్రస్ట్ అనాథ ఆశ్రమంలో ఆయన విద్యార్థులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. తన స్వగ్రామమైన ఓడూరు గ్రామస్తులతో పాటు, ప్రతి వారమూ మార్టేరులో నిర్వహించే పోలీ క్లినిక్‌లో వచ్చే మెదడు, పక్షవాతం వంటి వ్యాధులతో బాధపడుతూ రోగులకు ఎటువంటి ఫీజు లేకుండా వైద్య సేవలు అందిస్తున్న రామకృష్ణ పలువురు వైద్యులకు ఆదర్శప్రాయులని ఆశ్రమం పాస్టర్ మోజెస్ అన్నారు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయిన రామకృష్ణ స్వయంకృషితో చదువుకుని గ్రామానికి ప్రజలకు తన వంతు సేవలందించాలని ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ వృద్ధులకు, వితంతువులకు దుప్పట్లు, దుస్తులు అందజేస్తున్నారని తెలిపారు.

సత్యనారాయణమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శం

సంస్మరణ సభలో సిపిఎం రాష్ట్ర నేత మంతెన సీతారాం

మాట్లాడుతున్న మంతెన సీతారాం

ప్రజాశక్తి - యలమంచిలి

విప్లవం ద్వారానే సమాజం మార్పు చెందుతుందని సిపిఎం రాష్ట్ర నేత మంతెన సీతారాం అన్నారు. సోమవారం మండలంలోని చించినాడలో సమరశీల పోరాట యోధురాలు పెచ్చెట్టి సత్యనారాయణమ్మ సంస్మరణ సభ సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు అధ్యక్షతన జరిగింది. తొలుత సత్యనారాయణమ్మ చిత్రపటానికి నాయకులు పూల మాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సంస్మరణ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీతారాం మాట్లాడుతూ పుట్టుక, చావు మన చేతుల్లో ఉండదని, అయితే జీవించినంత కాలం మనం ఎవరికోసం జీవించామనేదే ముఖ్యమని తెలిపారు. సమాజంలోని అట్టడుగు ప్రజల ప్రయోజనాల కోసం సమానత్వం, సమ సమాజం కోసం పోరాటం చేయడమే కమ్యూనిజం అంతిమ లక్ష్యమని అన్నారు. ఆ కోవకు చెందిన సత్యనారాయణమ్మ ఆమె భర్త పోరాట నేత పెచ్చెట్టి కోట సత్యనారాయణ (బాబ్జి) అడుగుజాడల్లో నడుస్తూ చించినాడ గ్రామంలోని పేదల పక్షాన ఇతర మహిళా నాయకులతో కలిసి వీరోచితమైన పోరాటం చేసి గ్రామంలోని భూస్వామి వర్గంపై విజయం సాధించారని తెలిపారు. భార్యా భర్తలు ఇరువురు ప్రజల కోసమే జీవిస్తూ తుది శ్వాస విడిచే వరకూ ఎర్ర జెండాను వదలకుండా పలువురికి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. వారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని వారి ఆశయ సాధన కోసం పనిచేయడమే వారికి అర్పించే నిజమైన నివాళి అని తెలిపారు. సిపిఎం సీనియర్ నేత అప్పటి చించినాడ సమరశీల పోరాటానికి నాయకత్వం వహించిన మాజీ సర్పంచి, మాజీ సొసైటీ అధ్యక్షులు కేతా సూర్యారావు మాట్లాడుతూ 1978 - 1982 మధ్యకాలంలో చించినాడ గ్రామంలో జరిగిన సమరశీల పోరాట కాలంలో తమతో పాటు సత్యనారాయణమ్మ భర్త పెచ్చెట్టి కోట సత్యనారాయణ (బాబ్జి) అనేక నెలలు రిమాండ్ ఖైదీగా, అజ్ఞాతవాసంలో ఉన్నారని తెలిపారు. జైలు జీవితం అనుభవించిన కాలంలో అప్పటికే గ్రామ ఉపసర్పంచిగా ఉన్న సత్యనారాయణమ్మ ఇతర మహిళా ఉద్యమ నేతలు గంటా దినమ్మ, కేతా చారుమతి, బుడితి వజ్రమ్మ, బూసి శారమ్మ, మునకాల గాంధారి, శేషమ్మ , యాండ్ర అన్నపూర్ణ, కేతా తులసమ్మ, విప్పర్తి లక్ష్మి, తెన్నేటి లక్ష్మి, చెట్టిమి వజ్రమ్మ, గుమ్మాపు శశిరేఖ, జిల్లెల్ల ఆదిలక్ష్మి, చెల్లిబోయిన చంద్రావతి, మల్లుల భూలక్ష్మి, ఆకుమర్తి వెంకాయమ్మ తదితర నాయకులతో కలిసి అప్పటి రాష్ట్ర నాయకులుగా ఉన్న మల్లు స్వరాజ్యం, మోటూరు ఉదయం, అల్లూరి మన్మోహిని (అమ్మాజీ) అన్నే అనసూయమ్మ, తొట్టెంపూడి ప్రభావతి నాయకత్వంలో చించినాడలో ప్రజలపై అప్పటి భూస్వాములు చేస్తున్న దౌర్జన్య కాండను ఎదిరిస్తూ వారిపై వీరోచితమైన పోరాటం చేసిన వారిలో సత్యనారాయణమ్మ ఒకరన్నారు. అప్పట్లో ఆమెపై భూస్వాములు ఐదు అక్రమ కేసులు బనాయించినా వాటిని లెక్కచేయలేదని తెలిపారు. ఆ సమయంలో భూస్వాములపై సాధించిన విజయంలో మహిళలది కీలక పాత్ర ఉందని తెలిపారు. ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ మాట్లాడుతూ తన స్వగ్రామం కూడా చించినాడ గ్రామమే కావడంతో సత్యనారాయణమ్మతో చిన్నప్పటి నుంచి పరిచయం ఉందని, ఉద్యమంలోకి వచ్చిన కొత్తలో ఆమె తమకు బోధించిన సూచనలు సలహాలు ఇప్పటికీ ఆచరిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జెక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ సత్యనారాయణమ్మతో కలిసి వ్యవసాయ కార్మిక సంఘం బలోపేతానికి పనిచేశానని, ఆమె తోటి కార్యకర్తలను సొంత కుటుంబ సభ్యులుగా భావించే వారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి, ఐద్వా జిల్లా కోశాధికారి సరిపల్లి జయప్రభ, ఐద్వా మండల అధ్యక్ష కార్యదర్శులు బాతిరెడ్డి సుగుణ, జిల్లెల్ల ప్రశాంతి, జిల్లా ఐద్వా నాయకురాలు బాసిన శ్యామల, కలగంపూడి మాజీ సర్పంచి పొత్తూరి జ్యోతి, రైతు నాయకులు రుద్రరాజు సత్యనారాయణ రాజు, రుద్రరాజు చిన వర్మ, నాయకులు దేవ సుధాకర్ గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, గూడూరు నాగేశ్వరరావు, పడవల మాధవరావు, అంబటి రంగనాయకులు, గూడూరి ఆంజనేయులు, బొల్లా నరసింహమూర్తి, చెల్లుబోయిన నరసింహమూర్తి, మల్లుల రామారావు, మల్లుల ఆంజనేయులు, కేతా వాసు, తెన్నేటి శివాజీ పాల్గొన్నారు.

అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక పిజిఆర్ఎస్‌కు 21 ఫిర్యాదులు అందినట్లు జిల్లా అడిషనల్ ఎస్‌పి భీమారావు తెలిపారు. సోమవారం స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదులను సత్వరమే ప్రశ్నించాలని పోలీస్ స్టేషన్ అధికారులకు ఫోన్ చేసి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో భీమవరం డిఎస్‌పి రఘువీర్ విష్ణు, జిల్లా స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ కెవివిఎన్.సత్యనారాయణ పాల్గొన్నారు.

నరసాపురం:పిజిఆర్ఎస్‌లో అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆర్‌డిఒ దాసిరాజు ఆదేశించారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వ్యవస్థలో నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 36 ఫిర్యాదులు అర్జీదారుల నుంచి స్వీకరించినట్లు ఆర్‌డిఒ తెలిపారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలన్నారు. వివిధ శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రెండు వినతలు అందాయని తహశీల్దార్ రాజకిశోర్ తెలిపారు. మొగల్తూరు పంచాయతీ పడమటి పాలెంలోని ముత్యాలపల్లి గ్రామంలో భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రెండు వినతులు అందాయని తెలిపారు. ఎంపిడిఒం సిహెచ్ త్రిశూలపాణి, డిప్యూటీ ఎంపిడిఒ మేడిది నవీన్ కిరణ్, ఎంఇఒ యు.శామ్యూల్ జాన్ పాల్గొన్నారు.

గూడెంను ప్రథమ స్థానంలో నిలుపుతాం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెంలో పూర్తిస్థాయిలో మౌలిక సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేస్తామని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం 'మన కోసం మన శాసనసభ్యులు' కార్యక్రమాన్ని ప్రజా సమస్యల పరిష్కార వేదిక, 'ప్రజా దర్బార్' కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రజల నుంచి ప్రజా సమస్యల అర్జీలు స్వీకరించారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో ప్రధాన రహదారులను పూర్తిస్థాయిలో నిర్మిస్తున్నామని, త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. రెండో సమ్మర్ స్టోరేజీ ట్యాంకును ఈ సంవత్సరంలో పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. పట్టణంలో అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లు తదితర ఆస్తులకు సంబంధించి క్రమబద్ధీకరణ చేసుకొని పురపాలక సంఘానికి సహకరించాలని ప్రజలను కోరారు. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం తాము కృషి చేస్తున్నామని, అందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ సహకరించాలని కోరారు. అనంతరం టిడ్కో లబ్ధిదారులకు, దస్తావేజులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు, సంబంధిత శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలి

ఆచంట:మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్న ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి విమర్శించారు. సోమవారం తన కార్యాలయంలో మండలంలో అమలు జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, గ్రామ సచివాలయాల సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండడం, సేవలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంపిపి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ నిధులతో చేపట్టే అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభాలకు సర్పంచులు, ఎంపిటిసిలకు ముందస్తు సమాచారం ఇవ్వాలని ఎఇపిఆర్ ఎఇ ఆర్‌డబ్ల్యుఎస్ ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరా పరిస్థితిపై ఆరా తీసి శివారు ప్రాంతాల్లో శ్రద్ధ వహించి మెరుగుపర్చాలని డిప్యూటీ ఎంపిడిఒను ఆదేశించారు. గ్రామ సచివాలయాల్లో సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండేలా సర్వీసులు నమోదు చేసేలా చర్యలు చేపట్టాలని మండల గ్రామ సచివాలయ అధికారిని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ బి.కృష్ణమోహన్, ఎఇలు ఏడుకొండలు, రాజేశ్ పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కెఆర్ విద్యార్థినుల ప్రతిభ

భీమవరం టౌన్:ఈ నెల 26 నుంచి 27వ తేదీ వరకూ విజయవాడ విఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన జెఎన్‌టియుకె ఇంటర్ కాలేజీ ఎట్ సెంట్రల్ జోన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఉమెన్ టీం విన్నర్స్‌గా నిలిచిందని కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల బోర్డు మీటింగ్ హాల్లో విజేతలను ఘనంగా సత్కరించారు. కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ బిహెచ్‌వి ఎస్.రామకృష్ణంరాజు, ఫిజికల్ డైరెక్టర్ పి.సత్యనారాయణరాజు మాట్లాడుతూ టోర్నమెంట్‌లో ఫైనలియర్ విద్యార్థునులు పెన్మెత్స రక్షిత, కె.తేజస్విని, ఎ.జాహ్నవి విన్నర్స్‌గా నిలిచారని పేర్కొన్నారు. వారిని కళాశాల యాజమాన్యం, ఫిజికల్ ఎడ్యుకేషన్ అభినందనలు తెలిపారు.

సత్యనారాయణ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

ఆచంట:పెనుమంచిలి గ్రామానికి చెందిన సిపిఎం మాజీ శాఖ కార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పెచ్చెట్టి సత్యనారాయణ సంతాప సభ సోమవారం పెనుమంచిలిలో ఆయన ఇంటి వద్ద జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు సిర్రా నర్సింహమూర్తి, తలుపురి బుల్లబ్బాయి, పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సంతాప సభలో సిపిఎం మండల కార్యదర్శి పి.మోహన్‌రావు మాట్లాడుతూ పెచ్చెట్టి సత్యనారాయణ అకాల మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. రంగారావు, వర్ధనపు శ్రీరాములు, ఎం.వీర్రాజు పాల్గొన్నారు.

ఆర్గానిక్ కూరగాయలతో ఆరోగ్యం

మొగల్తూరు:సహజ సిద్ధంగా పండించిన కూరగాయల వినియోగంతో ఆరోగ్యం చేకూరుతుందని తహశీల్దార్ కె.రాజాకిశోర్, ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణి తెలిపారు. మొగల్తూరులోని కుక్కలవారితోట, నక్కావారిపాలెం, కోట ప్రాంతాల్లో ఎటువంటి ఎరువులు వినియోగించకుండా ప్రకృతి వ్యవసాయం చేసి పండించిన కూరగాయలను మండల పరిషత్ కార్యాలయ భవన సమీపంలో సిబ్బంది గురుజు కనకదుర్గా భవాని, ఎం.దుర్గాభవాని విక్రయించారు. ఆయా కూరగాయలను డిప్యూటీ ఎంపిడిఒ మేడిది నవీన్ కిరణ్, ఎంఇఒ యు.శామ్యూల్ జాన్, పలు శాఖల సిబ్బంది, జి.బుల్లి కూరగాయలను కొనుగోలు చేశారు

నరసాపురం: సహజ సిద్ధంగా పండిన కూరగాయలతో ఆరోగ్యం మెండుగా ఉంటుందని ఐసిడిఎస్ సిడిపిఒ ఊర్మిళ అన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రకృతి సిద్ధ కూరగాయలను సిబ్బంది స్టాల్ వద్ద విక్రయించారు. ఆయా కూరగాయలను పలు శాఖల అధికారులు, ప్రజలు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడారు.

రాయకుదురు విద్యార్థులకు సత్కారం

వీరవాసరం :ప్రతి విద్యార్థి ఒక సైంటిస్ట్‌గా ఎదగాలని ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని చంద్రశేఖర్ అన్నారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రథమ స్థానం సాధించిన రాయకుదురు విద్యార్థులను సోమవారం సత్కరించి అభినందించారు. జి.సాయిసుజిత్, డి.జయసాయి శ్రీనివాస్, ఎం.వినాయకభాస్కర్, ఎన్ఎల్ఎస్.సాయికుమార్ ప్రదర్శించిన ఎడారిలో మంచును సాంద్రీకరించి ఆ నీటిని తాగునీటి అవసరాలకు ఎలా వాడుకోవచ్చో అనే ప్రాజెక్టు ప్రథమ స్థానం సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను సత్కరించారు. జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్ నాయుడు, గెడ్డం భారతి, ఎంపిటిసిలు అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, కడలి నెహ్రూ, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ శలా భవాని, దేవిరెడ్డి పుల్లారావు, కో ఆప్షన్ సభ్యులు కడలి వాసు, దాశరథీ శ్రీనివాస్, వార్డు మెంబరు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

6న ఎస్ఆర్‌కెఆర్‌లో క్రక్స్ 2కె 26

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఇసిఇ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో జనవరి 6వ తేదీన క్రక్స్ 2కె 26 పేరిట హార్డ్వేర్ కాంటెస్ట్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కెవి.మురళీకృష్ణంరాజు చెప్పారు. దీనికి సంబంధించి పోస్టర్‌ను కళాశాల డైరెక్టర్ జగపతిరాజు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇసిఇ హెడ్ఎస్ఎస్.మోహన్ రెడ్డి, క్రక్స్ కో ఆర్డినేటర్ టివి.హైమాలక్ష్మి మాట్లాడారు. 25 సంవత్సరాలుగా ఇసిఇ డిపార్ట్మెంట్లో నిర్వహిస్తున్న క్రక్స్ 2కె 26, ఐఇటి స్టూడెంట్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. కాంపిటేషన్లో ఇతర డిపార్ట్మెంట్‌లతో పాటు ఇతర కళాశాల నుంచి కూడా పరిశోధనాత్మక హార్డ్వేర్ కంటెస్టులో పాల్గొనే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐఇటిఇ ఫాకల్టీ కోఆర్డినేటర్ కెఎన్‌వి.సత్యన్నారాయణ, స్టూడెంట్ ఆర్గనైజర్స్ పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, పెనుగొండ మండలం, ములపర్రు, దొడ్డివారి పాలెం గ్రామానికి చెందిన నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. అద్దె ఇంటి నుండి సొంత ఇంటికి మారుతున్నప్పుడు నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. పాస్‌పోర్టు నెంబర్ : H9252627 గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

దొడ్డి గణపతి, తండ్రి : కొండలరావు
దొడ్డివారిపాలెం, ములపర్రు
పెనుగొండ మండలం, ప.గో.జిల్లా.
సెల్ : 8143584493

మహారాజశ్రీ 3వ అదనపు సివిల్ జడ్జి కం మొబైల్ కోర్టు, ఏలూరు
E.P.No.12/2025 in O.S.No.81/2023

బిట్వీన్:
పైలా రామాంజనేయులు ...డిక్రీ హోల్డర్
AND
సప్పా వెంకట స్వర్ణలత ...జె.డి.ఆర్
భర్త: దుర్గారావు, డో.నెం.20ఇ-4-54, సబ్బుల వారి వీధి, కొత్తపేట, 40వ డివిజన్, ఏలూరు.

పై నెంబరు ఇ.పి.లో మీయొక్క హాజరు నిమిత్తం పై కోర్టు వారు **ది.09-01-2026వ తేదీ ఉదయం గం॥10:30 ని॥లకు వాయిదా వేసినారు.** కావున మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని పై కోర్టు నందు హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల పై నెంబరు ఇ.పి. మీ పరోక్షమున విచారించబడునని తెలుసుకొనగలరు.

B.V.APPA RAO
B.KUMAR
ఏలూరు, Advocates, Eluru-1.
25-12-2025. Cell: 94401 88346

CHANGE OF NAME
I, VEDIGANJI NAVYA (Old Name) D/o. K. Kishore, D. No 3-33, Malapalli, Vanguru Village, Pedavegi Mandal, Eluru district, A. P. I have changed my name as KALAPARTHI NAVYA (New Name) Here after my name is known as KALAPARTHI NAVYA (New Name).

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, పెనుగొండ మండలం, పెనుగొండ గ్రామం, చెరుకువాడ, బైపే వారి వీధి చెందిన కణితి మరియమ్మ భర్త : సత్యనారాయణ అను నేను నా యొక్క పాస్‌పోర్టుతో ఇంటి దగ్గర నుండి జిరాక్స్ సెంటర్‌కు వెళ్తుండగా నా యొక్క పాస్‌పోర్టు పడిపోయింది. నా యొక్క పాస్‌పోర్టు నెంబర్ : M8687339 గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

కణితి మరియమ్మ, భర్త : సత్యనారాయణ
బైపె వారి వీధి, చెరుకువాడ, పెనుగొండ గ్రామం,
పెనుగొండ మండలం. ప.గో.జిల్లా
సెల్ : 9603955894

CHANGE OF NAME
I, **Velamati Nagendra Bhupathi** S/o. Velamati Venkata Subbarao residing at H.No: 24A-13-8, Kandukuri Viresalingam Street, Ashoknagar, Eluru, Eluru District, A.P. Pin-534002. I have changed my name from Velamati Nagendra Bhupati (Old Name) to **Velamati Nagendra Bhupathi (New Name),** hence forth I am being called as **Velamati Nagendra Bhupathi (New Name)** for all purposes

మహారాజశ్రీ 2వ ఎడిషనల్ సివిల్ జడ్జి ఏలూరు, ఏలూరు జిల్లా.
ఓ.యస్.నెం.119/2025

బిట్వీన్ :
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంచ్ మేనేజర్ వట్లూరు బ్రాంచ్, ఏలూరు ...వాది
And
కాంద్రు విజయబాబు, S/o.రాములు, ధర్మాజీగూడెం, ఏలూరు. ...ప్రతివాది

వాది దాఖలు చేసిన పబ్లికేషన్

పై నెంబరు గల దావాలో ప్రతివాదికి తెలియజేయునది ఏమనగా పై తెలిపిన కోర్టులో ది.03-02-2026వ తేదీన వాయిదా కలదు. ఉదయం 10.30 ని॥లకు స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి తమ ఆక్షేపణలు తెలియపర్చుకొనవచ్చును. లేనియెడల కోర్టు వారు పరోక్షంగా, తీర్మానం చేయగలరని తెలియజేయుచున్నాము.

కొండేటి శ్రీనివాసరావు, అడ్వకేట్
పానుగంటి వారి వీధి,
స్థలం: ఏలూరు ఏలూరు.
తేది.30-12-2025 సెల్: 94412 76324

మహారాజశ్రీ 2వ ఎడిషనల్ సివిల్ జడ్జి ఏలూరు, ఏలూరు జిల్లా.
ఓ.యస్.నెం.309/2025

బిట్వీన్ :
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంచ్ మేనేజర్ సి.ఆర్.ఆర్.బ్రాంచ్, ఏలూరు ...వాది
And
బూరుగు జాన్ కెనడీ, S/o.ఇశ్రాయేలు, ఏలూరు. ...ప్రతివాది

వాది దాఖలు చేసిన పబ్లికేషన్

పై నెంబరు గల దావాలో ప్రతివాదికి తెలియజేయునది ఏమనగా పై తెలిపిన కోర్టులో ది.30-01-2026వ తేదీన వాయిదా కలదు. ఉదయం 10.30 ని॥లకు స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి తమ ఆక్షేపణలు తెలియపర్చుకొనవచ్చును. లేనియెడల కోర్టు వారు పరోక్షంగా, తీర్మానం చేయగలరని తెలియజేయుచున్నాము.

కొండేటి శ్రీనివాసరావు, అడ్వకేట్
పానుగంటి వారి వీధి,
స్థలం: ఏలూరు ఏలూరు.
తేది.30-12-2025 సెల్: 94412 76324

మహారాజశ్రీ 3వ ఎడిషనల్ సివిల్ జడ్జి ఏలూరు, ఏలూరు జిల్లా.
ఓ.యస్.నెం.120/2025

బిట్వీన్ :
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంచ్ మేనేజర్ గోల్డ్ బజార్ బ్రాంచ్, ఏలూరు ...వాది
And
పంద రమేషన్ దొర, S/o.గంగరాజు, ఏలూరు. ...ప్రతివాది

వాది దాఖలు చేసిన పబ్లికేషన్

పై నెంబరు గల దావాలో ప్రతివాదికి తెలియజేయునది ఏమనగా పై తెలిపిన కోర్టులో ది.30-01-2026వ తేదీన వాయిదా కలదు. ఉదయం 10.30 ని॥లకు స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి తమ ఆక్షేపణలు తెలియపర్చుకొనవచ్చును. లేనియెడల కోర్టు వారు పరోక్షంగా, తీర్మానం చేయగలరని తెలియజేయుచున్నాము.

కొండేటి శ్రీనివాసరావు, అడ్వకేట్
పానుగంటి వారి వీధి,
స్థలం: ఏలూరు ఏలూరు.
తేది.30-12-2025 సెల్: 94412 76324

PUBLIC NOTICE
IN THE COURT OF IV ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION), ELURU
O.S.No.346/2025

Between:
Kayita Uma Sankar ...Plaintiff
And
Beesetti Nageswararao ...Defendant
To:
Beesetti Nageswararao, S/o.Kanakaiah, R/o.D.No.23A-1-4/2, Raghavachari Street, R.R.Pet, Eluru.

Whereas, the plaintiff has filed the suit in O.S.No.346/2025 against the defendant for recovery of the amount due under the suit promissory note. The plaintiff also filed petition in I.A.No.204/2025 for attachment of the petition schedule property belongs to the defendant before judgment, where as the Hon'ble Court ordered notice to you and posted the matter for your appearance. Therefore, you are called upon to appear before the Hon'ble Court on 05.01.2026 at 10.30 AM., and state your objections if any, else, the matter will be decided in your absence.

PYDI VENKATA RAJU
Advocate, Eluru.
Cell: 9885199811.

మహారాజశ్రీ ఏలూరు మొదటి అదనపు జిల్లా కోర్టులో
ఐ.ఎ.నెం.746/2023
M.V.O.P 361/2019

బిట్వీన్ :
కె.జయలక్ష్మి & 2 అదర్స్ ...పిటీషనర్లు
Vs
ఎ.శేషగిరిరావు & అదర్స్ ...రెస్పాండెంట్లు
R3 : అడబాల దుర్గా భూలక్ష్మి, W/o. Late శేషగిరిరావు, వీరవాసరం గ్రామం.
R4 : అడబాల స్వామి నాయుడు, S/o. Late శేషగిరిరావు, వీరవాసరం గ్రామం.
R5 : అడబాల రాజు, S/o. Late శేషగిరిరావు, వీరవాసరం గ్రామం.
R6 : అడబాల బేబి ధనలక్ష్మి, D/o. Late శేషగిరిరావు, వయస్సు 24, స్త్రీ, D.No.8/1-4/A, మత్స్యపురి రోడ్, వీరవాసరం గ్రామం, మండలం, ప.గో.జిల్లా.

పై నెంబరు ఒపి యందు రెస్పాండెంటు 3 to 6 కు నోటీసు నిమిత్తం ది.20.1.2026కి వాయిదా అయి ఉన్నది. పై తేదీన 10.30 ని॥లకు శ్రీకోర్టు వారి యెదుట హాజరై ఆక్షేపణలున్నచో తెల్పుకోని యెడల కేసు మీ పరోక్షముగా తీర్మానించెదరు.

జగ్గవరపు సురేష్‌కుమార్ రెడ్డి
అడ్వకేట్, ఏలూరు.
సెల్: 9441606789

మహారాజశ్రీ 3వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) (మొబైల్ కోర్టు), ఏలూరు వారి కోర్టులో
O.S.255/2025

బిట్వీన్ :
శ్రీమతి పింజర్ల గోవర్ధనమ్మ ...వాది
మరియు
శ్రీమతి తూతిక లక్ష్మీభ్రమరాంబ ...ప్రతివాది
To.
శ్రీమతి తూతిక లక్ష్మీభ్రమరాంబ, W/o.నాగేంద్రరావు, R/o.H.No.22C-1-122, తూర్పు వీధి, 7వ డివిజన్, ఏలూరు.

పై నంబరు గల దావాలో ప్రతివాది యొక్క హాజరు నిమిత్తం ది.20-1-2026వ తేదీకి వాయిదా అయివున్నది. కావున ప్రతివాది ది.20-1-2026వ తేది ఉదయం 10.30 గంటలకు పైకోర్టు వారి ఎదుట ప్రత్యక్షంగా గానీ, ప్లీడరు ద్వారా కాని హాజరు కావలెను. లేనియెడల పై నంబరు దావా ప్రతివాది పరోక్షంలో తీర్మానించబడును.

బి.శ్రీలక్ష్మి,
అడ్వకేట్, ఏలూరు.
సెల్: 8019442114